


# పరిష్కారం

పెద్ద సంసారం గోవిందుడిది. అయినా ప్రతి రోజూ ఏదో సమస్య. తండ్రికి పక్షవాతం, తల్లికి కీళ్ళవాతం, భార్యకి అంతుపట్టని దీర్ఘ వ్యాధి, కూతురికి చెముడు, కొడుక్కి జలుబు, దగ్గు. నీళ్ళు లాగా డబ్బు ఖర్చు పెట్టినా, ఏ ఒక్కరి వ్యాధి తగ్గలేదు సరికదా రోజు రోజుకీ తీవ్రం అయినాయి.

ఇంటికి వస్తే చాలు ప్రతి ఒక్కరూ తమ వ్యాధుల్ని గురించి చెప్పేవారు. చివరకు గోవిందుడికి కూడా ఉబ్బస వ్యాధి పట్టుకుంది.

ఈ రోగాలతో, కష్టాలతో బాగా విసిగి వేసారి పోయాడు. 'సన్యాసి సుఖీ, సంసారి దుఃఖీ' అనుకుంటూ జై బ్రహ్మదేవా అంటూ సన్యాసం పుచ్చుకుని పక్కనే వున్న ఓ అడవిలో చెట్టు క్రింద కూర్చుని తపస్సు ప్రారంభించాడు, ఇలా ఎంతకాలం తపస్సు చెయ్యాలో అనుకు. టూ.

ముచ్చటగా మూడేళ్ళు గడవగానే బ్రహ్మ సాక్షాత్కారం అయింది. ఇంత త్వరలో సాక్షాత్కారం కలిగినందుకు గోవిందుడు ఆశ్చర్య పోయాడు.

''నరుడా! ఏమిటి నీ కోరిక?'' అన్నాడు బ్రహ్మదేవుడు అలవాటు ప్రకారం.

''కోరిక మాట అలా వుంచు, అదేమిటి అప్పుడే ప్రత్యక్షం అయ్యావు. నేను తపస్సు మొదలుపెట్టి యింకా ముష్టి మూడేళ్ళయినా కాలేదే! మరి పూర్వకాలంలో తపస్సు చేసే వాళ్ళ చుట్టూ పుట్టలు కట్టాలి, గడ్డాలు మీసాలు పెరిగిపోవాలి. ఆ శక్తితో ఇంద్రుడు భయపడి రంభను పంపాలి, రంభ కూడా ఓడిపోయిం తరువాత, ఆ తపాగ్ని ముల్లోకాలనూ దహిస్తుంటే అప్పుడు కదా ప్రత్యక్షం అవాలి'' అన్నాడు గోవిందుడు.

''అవునయ్యా! అది కృత, త్రేతా, ద్వాపర యుగాల విషయం. ఆ యుగాల్లో తాపసులకు

డి. రామలక్ష్మి



అంతటి పట్టుదల దీక్ష వుండేవి. తపస్సు చేస్తున్న దేవుడు ప్రత్యక్షం కాకపోతే ఎన్ని యుగాలయినా చెదలు పట్టినా, పాములు పాకినా తపస్సు సాగించేవారు.

మరి ఈ కాలం అంటావా! కలియుగం. ఓ పక్క నుంచి దైవభక్తి నశించిపోతుంది. తపస్సుల మాట అలా వుంచి, మమ్మల్ని తలచుకునే నాథుడే దొరక్కుండా పోయాడు. ఎవరైనా తలచుకున్నా మేం కనిపించగానే, ''అసలు నువ్వు నిజంగా దేవుడేనా? ఏ సినిమాలోంచో, నాటకంలోంచో ఆ దుస్తులతో పారిపోయొచ్చావా'' అంటున్నారు.

''అందుకని మేం దేవుళ్ళందరూ కలిసి ఓ నిర్ణయం తీసుకున్నాం. ఎవరన్నా తపస్సు అంటూ మొదలుపెట్టగానే నేను అంటే బ్రహ్మ అయితే మూడేళ్ళకి, విష్ణువు అయితే అయిదేళ్ళకి, శివుడయితే ఏడేళ్ళకల్లా దర్శనం యివ్వాలని నిర్ణయించుకుని మధ్యలో రంభని, ఊర్వశిని పంపి తపోభంగం కలిగించవద్దని ఇంద్రుడికి చెప్పాం. తపస్సు చేస్తున్నవారి జాబితా ఎప్పటికప్పుడు త్రిమూర్తులకు అందించమని నారద మునికి ఆదేశాలిచ్చాం.''

''ఎందుకు...'' ఎంతో ఆత్రంగా అడిగాడు గోవిందుడు.

''ఎందుకంటా వేమిటయ్యా! ఆలశ్యం చేశామనుకో, భూలోకంలో మాకున్న కాస్త పేరూ పడిపోతుంది. ఇకా తరువాత గుడి గోపురాలకి విలువ లేకుండా పోతుంది. భక్తులు వుంటేనే, గుళ్ళు వుంటాయి, దేవుళ్ళు బ్రతుకుతారు. అందుకే ఎక్కువ శ్రమ పెట్టకుండా త్వరగా ప్రత్యక్షం అవాలని నిర్ణయించుకున్నాం. ఇంతకీ నీకే వరం కావాలో కోరుకో.''

''వరాలు కోరికాదు బ్రహ్మయ్యా! నేను తపస్సు చేసేది.''

''మరింకెందుకు?'' ఆశ్చర్యపోయాడు బ్రహ్మదేవుడు.

''నాకో అనుమానం వుంది, అది నివృత్తి చేసుకోవాలని.''

''ఏమిటది త్వరగా చెప్పు, మళ్ళీ నా హంస

వాహనానికి తామర తూడులు తినే సమయం దగ్గరపడుతూంది'' అన్నాడు కాస్త చిరాకుగా బ్రహ్మదేవుడు.

''తెలుసండి బాబూ, మీ కాలం అమూల్య మైందని తెలుసు. నా అనుమానం ఏమి టంటే, మీరు సర్వ శక్తివంతులు, సర్వాంత ర్యామి, సర్వలోక రక్షకులు కదా, మరి మీ భక్తులకే ఇంత కష్టాలు పెడతారేం? నాస్తికు లను, ఆస్తికులను కూడా ఒకే తాటిలో నడుపుతాగేం'' అన్నాడు.

''పూర్వ జన్మ సుకృతం బిడ్డా! అది తీరితే గాని ఈ జన్మలో సుఖం దొరకదు. చేసుకున్న వారికి చేసుకున్నంత మహాదేవా! ఆ పాప పరి హారం అయితే గాని సుఖాలు దొరకవు" అన్నాడు.

''భలేవాడివయ్యా! యీ వేదాంతం చెప్ప డానికా నిన్ను యింత కష్టపడి ప్రత్యక్షం చేసు కుంది. ఈ శ్రీరంగనీతులు మా లోకంలో ప్రతి ఒక్కరూ చెప్పేవే! మానవులంతా ఆస్తికులు, నాస్తికులూ మీకు సమానం అయినప్పుడు నాస్తికులలాగా పూజలు మానెయ్యొచ్చుగా. ఈ తిరకాసు సమాధానం నాకు నచ్చలే దయ్యా. నీ వరాలు, గిరాలు నాకక్కర్లేదు'' అన్నాడు.

బ్రహ్మదేవుడికి గుండె ఆగినంత పనయింది. ఇంకా ఇతనితో మాట్లాడుతూ కూర్చుంటే కాలికేస్తే వేలికి, వేలికేస్తే కాలికి లాగి తన చేతనే ''నువ్వు చెప్పింది నిజమే నయ్యా, నిజంగానే దేవుడు లేడు'' అని కూడా అనిపించవచ్చు అనుకుంటుండగానే, "ఏమయ్యా బ్రహ్మయ్యా! మాట్లాడవేమయ్యా" అని గోవిందుడు గర్జించేసరికి తారెత్తి బ్రహ్మ దేవుడు అదృశ్యుడైపోయాడు.

అందుకే అన్నారు పెద్దలు - మొండివాణ్ని దేవుడు కూడా మార్చలేడని.

(ఇది కేవలం వ్యంగ్య రచన. అంతే గాని దేవుళ్ళను కించపరచటం రచయిత అభి ప్రాయం కాదు.)

